
సాక్షి ఒడిశా

సోమవారం । 13 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,46,949లు, బంగారం 2 గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 52 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

సిట్టింగ్‌లకు దక్కని సీట్లు

లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధికార బిజూ జనతా దళ్ పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు టికెట్లు నిరాకరించింది.

- 8లో



రాయగడలో భారీ వర్షం

రాయగడలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.

- 8లో

న్యూస్‌రీల్

రెండో దశ బరిలో 305 మంది అభ్యర్థులు

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న రెండో దశ పోలింగ్‌లో పాల్గొనే అభ్యర్థులు ఖరారు అయ్యారు. మే 20న బర్‌గడ్, సుందర్‌గడ్, బొలంగీర్, కంధమల్, అసికా 5 పార్లమెంటరీ నియోజకవర్గాలు, వాటి అనుబంధ 35 శాసనసభ నియోజక వర్గాల్లో పోలింగ్ జరగనుంది. ఈ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు సమగ్రంగా 305 మంది అభ్యర్థులు ఖరారయ్యారు. 5 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో పోటీకి 40 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. ఈ నియోజకవర్గాల్లో పోటీకి సమగ్రంగా 47 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో ఆరు తిరస్కరణకు గురయ్యాయి. మరో అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకున్నారు. అలాగే 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 265 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ విడత పోటీకి 298 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. వారిలో 23 మంది అభ్యర్థుల నామినేషన్లు పరిశీలన దశలో రద్దు అయ్యాయి. 10 మంది అభ్యర్థులు పోటీ నుంచి వైదొలగి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

ఎన్నికల పండగలో పాల్గొనాలి

- మల్కన్‌గిరి కలెక్టర్ సచిన్ పవార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సచిన్ పవార్

మల్కన్‌గిరి: ప్రతి ఒక్కరూ ఎన్నికలో భాగస్వాములు కావాలని మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ సచిన్ పవార్ కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మల్కన్‌గిరిలో 4,52,544 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరి కోసం 547 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 30 సఖి బూత్‌లు పూర్తిగా మహిళల కోసం సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. అలాగే దివ్యాంగుల కోసం రెండు, యువత కోసం పది కేంద్రాలను సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. యూత్ కోసం కేటాయించిన కేంద్రాల్లో 30 ఏళ్ల లోపు సిబ్బంది విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, గొడుగులు, మంచినీరు, ఓఆర్ఎస్, మందులను సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటలకు జరగనున్న పోలింగ్‌లో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

రూ.2,11,116లు విరాళం



జగన్నాథ మందిరం నిర్మాణానికి రాయిని ప్రతిష్ఠించిన పోట్నూరు రామకృష్ణ దంపతులు

పర్లాకిమిడి: స్థానిక జగన్నాథ మందిరం పునర్ నిర్మాణ కార్యక్రమాలకు బంగారం వ్యాపారస్తులు, సూర్యా జ్యూయలర్స్ పోట్నూరు రామకృష్ణ, స్వప్న దంపతులు ఆదివారం అంగ్యమాల మందిర నిర్మాణ రాయికి ఇంటి వద్ద పూజలు చేయించారు. రాయిని జగన్నాథ మందిరంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా జగన్నాథ మందిర నిర్మాణానికి రూ.2,11,116లు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శ్రీమందిరం పునర్ నిర్మాణ కర్తలు దుర్గాప్రసాద్ పాణిగ్రాహి, భీమ్ సేన్ పండా తదితరులు పాల్గొన్నారు.

చందన యాత్ర శోభ



భువనేశ్వర్ : పూరీ శ్రీ జగన్నాథుని చందన యాత్ర కనుల పండువుగా సాగుతోంది. సంధ్య వేళలో స్వామివారు పల్లకిలో ఊరేగుతూ నరేంద్ర సరోవరం తీరం చేరే మార్గంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించడంపై సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది. అడుగడుగున దీప ధూపాదులు, మంగళ హారతులతో స్వామిని ఆహ్వానించి భక్తులు తరిస్తున్నారు. పల్లకిలో శోభాయమానంగా స్వామి దర్శనం లభిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో నేడు.. తొలిదశ పోలింగ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ అరుణ్ కుమార్ షడంగి

- 4 లోక్‌సభ, 28 శాసనసభ స్థానాలకు ఎన్నికలు
- 7,298 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- తొమ్మిది జిల్లాల్లో నక్సల్స్ ప్రభావం



మారుమూల ప్రాంతాలకు హెలీకాప్టర్‌లో పోలింగ్ సిబ్బందిని తరలిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో నేడు తొలిదశ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. మొత్తం నాలుగు లోక్‌సభ నియోజకవర్గాలు, 28 శాసనసభ నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. తొలిదశ ఎన్నికల కోసం వివిధ ప్రాంతాల్లో 17 వేల మంది పోలీసు బలగాలను మోహరించారు. ఈ మేరకు మొత్తం తొమ్మిది జిల్లాల్లో 7,298 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

ఈవీఎంల తరలింపు

భద్రతా దళాల సన్నద్ధత గురించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్ కుమార్ షడంగి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం), వీవీప్యాట్లు, పోలింగ్ పార్టీలను ఆయా నియోజకవర్గాలకు తరలించినట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల్లో సమగ్రంగా ఏర్పాటైన 7,298 పోలింగ్ బూత్‌ల్లో కొన్ని బూత్‌లు మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. మొత్తం బలగాల్లో 104 కంపెనీల పారా మిలటరీ బలగాలు, 66 ప్లాటూన్ల ఎస్‌పీపీలుని నియమించారు. బూత్‌లను తనిఖీ చేసేందుకు 600 సంచాలక బృందాల్ని రంగంలోకి దింపుతున్నారు. ఒక్కో సంచాలక బృందం 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తుందని వివరించారు.

సీసీటీవీ నిఘా

ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్టులన్నీ సీసీ కెమెరాల నిఘాలో ఉంటాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలీసులు 210 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 195 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈవీఎంలను 15 స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తారు. పారామిలటరీ బలగాలతో స్ట్రాంగ్ రూమ్‌ల లోపలి పరిధి భద్రతా వలయం మధ్య వీటిని భద్రపరచనున్నట్లు పేర్కొన్నారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వెలుపల భాగంలో ఎస్‌పీపీలు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారని డీజీపీ తెలిపారు.

ప్రత్యేక భద్రత

సోమవారం పోలింగ్ జరగనున్న తొమ్మిది జిల్లాల్లో ఆరు నక్సల్స్ ప్రభావిత జిల్లాలు ఉన్నాయి. పోలింగ్ అధికారుల భద్రత కోసం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. మావోయిస్టు ప్రాబల్యం ఉన్న సునాబెడా ప్రాంతాలకు ప్రత్యేక హెలికాప్టర్ల ద్వారా ఏడు పోలింగ్ పార్టీలను పంపించారు. రాష్ట్రంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల కోసం భారత ఎన్నికల సంఘం హెలికాప్టర్‌ను అందించిందని డీజీపీ తెలిపారు. ఎన్నికల సంఘం పోలింగ్ పార్టీల కోసం ఎయిర్ అంబులెన్స్‌ను కూడా సమకూర్చినట్లు ప్రకటించారు.

• రథాల పనులు ఆరంభం



శ్రీజగన్నాథుని యాత్ర కోసం రథాల తయారీ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. ప్రధాన వడ్రంగి (మహరణ వర్గం) కొలతలతో దుంగలను ఖరారు చేయడంతో, రంపం కార్మికులు కోత పనులు మొదలు పెట్టారు. 3 రథాలకు వేర్వేరుగా ప్రధాన మహరణలు తయారీ పనులను పర్యవేక్షిస్తారు. - భువనేశ్వర్/పూరీ

• అమ్మ ప్రేమ వెలకట్టలేనిది



మాతృ దినోత్సవ సందర్భంగా బరంపురంలోని భేజ్జిపూర్, నీలకంఠ నగర్ 3వ లైన్‌కి చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ రూపాయి నాణాలతో మాతృమూర్తి చిత్రాన్ని ఆదివారం తయారు చేశారు. ఈ చిత్రం స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది. సైకత శిల్పికి నగరంలోని ప్రముఖులు, కళా ప్రేయులు అభినందనలు తెలియజేశారు. - బరంపురం

హోమ్ ఓటింగ్ శిక్షణ



హోమ్ ఓటింగ్ శిక్షణ కార్యక్రమం



శిక్షణ పొందుతున్న పోలింగ్ సిబ్బంది

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా 115వ నంబర్ జట్నీ శాసనసభ నియోజకవర్గంలో పోలింగ్ పురస్కరించుకుని ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జాతీయ విజ్ఞాన విద్య పరిశోధన సంస్థ నైజరు ప్రాంగణంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ శిక్షణ శిబిరంలో వయో వృద్ధులు, దివ్యాంగులతో ఇంటి నుంచి ఓటు వేయించడం, పోస్టలు బ్యాలెట్ నిర్వహణకు సంబంధించి శిక్షణ కల్పించారు. భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో భాగమైన జట్నీ అసెంబ్లీ శాసనసభ నియోజకవర్గంలో ఈనెల 25వ తేదీన మూడో విడతలో పోలింగ్ జరగనుంది.

గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్య



దర్యాప్తు చేస్తున్న కె.నువాగాం పోలీసులు

- దిగపండి–నారాయణపూర్ రోడ్డులో ఘటన



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బరంపురం: గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. ఈ సంఘటన బరంపురం నగర పరిధి దిగపండి–నారాయణపూర్ గ్రామ రహదారిలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఐఐసీ అధికారి మహేంద్రకుమార్ బెహర తెలిపిన వివరాల ప్రకారం.. బరంపురం జిల్లా కె.నువాగాం పోలీసుస్టేషన్ పరిధి దిగపండి బ్లాక్, బమ్మినిపూర్ పంచాయతీ నారాయణపూర్ గ్రామం సమీపంలోని కెనాల్ దగ్గర వ్యక్తి మృతదేహం ఉన్నట్టు సమాచారం వచ్చినట్టు పేర్కొన్నారు. దీంతో తమ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారన్నారు. గుర్తు తెలియని వ్యక్తిని ఎవరో హత్యచేసి పరారైనట్టు అనుమానిస్తున్నట్టు వెల్లడించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎంకేసీజీ మెడికల్ కళాశాలకు చెందిన ఎఫ్ఎమ్‌టీ విభాగానికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

చిరుతపులి చర్మం స్వాధీనం

- ఐదుగురి అరెస్టు



పులి చర్మంతో నిందితులు, చిత్రంలో అటవీ శాఖ సిబ్బంది

రాయగడ: చిరుత పులి చర్మాన్ని అక్రమంగా విక్రయిస్తున్న వారిపై జిల్లాలోని పద్మపూర్ అటవీ శాఖ సిబ్బంది ఆకస్మిక దాడులను నిర్వహించారు. పులి చర్మాన్ని స్వాధీనం చేసుకొని ఐదుగురిని అరెస్టు చేశారు. అరెస్టయి వారిలో రవీంద్ర బిడిక, అక్షయ కుమార్ ఒరియా, సింహాచల్ సాబొరొ, హలధర్ సాబోరో, నిఖిల్ గంట ఉన్నారు. పులి చర్మాల అక్రమ వ్యాపారాలు కొనసాగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా అటవీ శాఖ అధికారి సచిన్ నానా సాహెబ్ ఒహాలే ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పద్మపూర్ అటవీ ప్రాంతంలోని మామిడితోటలో శనివారం సాయంత్రం పులిచర్మం క్రయవిక్రయాలకు కోసం చర్చలు జరుగుతున్న సమయంలో అటవీ సిబ్బంది ఆకస్మిక దాడులను నిర్వహించారు.

వలస ఓటర్లపై ప్రధాన పార్టీల దృష్టి



గ్రామాలకు చేరుకుంటున్న వలస కార్మికులు

బరంపురం: ఎన్నికల పోలింగ్ గడువు సమీపించింది. తొలివిడత పోరు సోమవారం జరగనుండగా.. మరికొన్ని విడతల్లో కూడా రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు పావులు కదుపున్నాయి. దీంట్లో భాగంగా వలస ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి పదరానిపాట్లు పడుతున్నారు. రాష్ట్ర రాజకీయాలతో ప్రధానంగా ముడి పడి ఉన్న గంజాం జిల్లా నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అధికార పార్టీ బీజేడీతోపాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు వలస ఓటర్లను మన్ననం చేసుకోవడానికి కృషి చేస్తున్నారు. గంజాం జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టిసారించారు. పోటీ తీవ్రంగా ఉండడంతో వలస ఓటర్లు కీలకకంగా మారనున్నారు. గ్రామాల వారీగా ఉన్న వలస ఓటర్ల వివరాలను నాయకులు సేకరిస్తున్నారు. సామాజికవర్గాల వారీగా వారిందరినీ గ్రామాలకు రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. పక్క రాష్ట్రాల్లో ఉన్న జిల్లా వలస కార్మికులకు ఫోన్లు చేసి రాకపోకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

దారుణం

- చినాన్నను నరికి చంపిన అన్న కొడుకు



ముక్క పోడియమి మొండెం



నిందితుడు రామ పోడియమి




మృతదేహం వద్ద రోదిస్తున్న ముక్క పోడియమి భార్య

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 79 పోలీసుస్టేషన్ పరిధి తేల్‌రాయి పంచాయతీ ఇప్పిగూడ గ్రామంలో ముక్క పోడియమి(43) అనే వ్యక్తిని తన అన్న కొడుకు రామ పోడియమి హత్య చేసిన ఘటన సంచలనం సృష్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని గిరిజనులు మామిడి పండ్లు తినడం కోసం చిన్న పండగను ఆదివారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి ఇంటికి వచ్చిన రామను ఎక్కడికి వెళ్లావు అని అతడి చిన్నాన్న ముక్క అడిగాడు. దీంతో చినాన్న, కొడుకు మధ్య మాటామాటా పెరిగి గొడవ జరిగింది. దీంతో రామ కోపంతో తాటికాయలు కొట్టే కత్తి తీసుకొని వచ్చి చినాన్నపై ఒకసారిగా దాడి చేశాడు. దీంతో వెంటనే అతని మెడతెగి కొంతదూరంలో పడింది. అది చూసిన గ్రామస్తులు భయంతో కేకలు వేశారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని రామను అరెస్టు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది



కేటాయించిన గ్రామాల వివరాలు తెలుసుకుంటున్న సిబ్బంది



పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సచిన్ పవార్



ఈవీఎంలతో వెళ్తున్న సిబ్బంది

మల్కన్‌గిరి: రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలకు తొలివిడత ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. దీంతో పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలకు తరలివెళ్లారు. మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నికల్ కాలజీ వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కేంద్రం నుంచి శని, ఆదివారాల్లో బయలుదేరి వెళ్లారని జిల్లా కలెక్టర్ సచిన్ పవార్ తెలిపారు. ముఖ్యంగా చిత్రకొండ సమితి స్వభిమాన్ ఏరియాలోని పంచాయతీలు, కలిమెల సమితి మోటు, పోడియ సమితిలని పలు పంచాయతీలకు సిబ్బందిని ప్రత్యేక వాహనాల్లో తరలించారు. మొత్తం 3,650 మంది సిబ్బందిని కేటాయించామన్నారు.

క్లుప్తంగా

రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తాం

- సీఈఓ నికుంజా బిహారీ ధల్

భువనేశ్వర్: ఎన్నికల విధుల్లో మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్లు ఒడిశా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) నికుంజా బిహారీ ధల్ ఆదివారం ప్రకటించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎక్స్‌గ్రేషియా చెల్లింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో సోమవారం జరగనున్న ద్వంద్వ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా ఒక వ్యక్తి మరణించినట్లు సమాచారం. నవరంగపూర్ జిల్లాలోని స్వామి వివేకానంద విద్యామందిర్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలింగ్ స్టేషన్‌కు వెళుతుండగా సిబ్బంది మృతి చెందాడు. మృతుడు ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి ఉద్యోగి అలేఖ్ రంధారిగా గుర్తించారు. ఈ సంఘటన అనుబంధ అధికార యంత్రాంగం ధృవీకరించాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో ఉజ్జడి బండి ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట వద్ద వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మతల్లి పెద్ద పండగలు సందర్భంగా ఆదివారం ఉజ్జడి బండి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఉజ్జడి బండిని ఊరేగింపుగా తీసుకెళ్లగా భక్తులు బండి నిండుగా ప్రసాదాలను సమర్పించారు. గ్రామ పొలిమేర వరకు తీసువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరికి దిష్టిదోషం లేకుండా అమ్మవారికి బలిదానం చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 28 వరకు అమ్మవారి పండగలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఒడిశా మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

టెక్కలి రూరల్: మండలంలోని భగవాన్‌పురం గ్రామానికి చెందిన కొర్ను రవికుమార్ అక్రమంగా మద్యం రవాణా చేస్తుండగా ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా రాష్ట్రం పర్లాఖిమిడి నుంచి మద్యం తీసుకొస్తూ తిర్లంగి గ్రామం వద్ద ఎస్ఈబీ అధికారులను చూసి పరిగెత్తడంతో అధికారులు వెంబడించి పట్టుకున్నారు. సంచిలో 96 ఒడిశా మద్యం బాటిళ్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఈబీ సీఐ జి.ఎస్.రాజశేఖరనాయుడు తెలిపారు.

మండల సర్వేయర్ మృతి

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామానికి చెందిన చింత మహేష్ (40) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన విజయనగరం జిల్లా రేగిడి మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం విరోచనాలు ఎక్కువగా అవడంతో కుటుంబ సభ్యులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. మహేష్‌కు భార్య స్వాతి, ఇద్దరు కుమార్లు, కుమార్తె ఉన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి
- గజపతి జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఎన్నికలు
- పర్లాకిమిడి, మోహానాలో 4,63,467 మంది ఓటర్లు



పర్లాకిమిడి: ఎన్నికల పోలింగ్‌కు తరలివెళ్తున్న సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి ప్రారంభం కానున్నది. బరంపురం పార్లమెంటరీ స్థానంలో పర్లాఖిముండి, పర్లాఖిమిడితో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. గజపతి జిల్లాలోని మోహనా, పర్లాకిమిడి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 573 పోలింగ్ కేంద్రాల్లో 4,63,467 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 89 కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పర్లాకిమిడిలో మహిళలు, ట్రాన్స్‌జెండర్స్ కోసం 81 ఆదర్శ మతదాన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 57 సఖీ మతదాన్ కేంద్రాలు, అయిదు పర్యావరణ కేంద్రాలు, మరో 5 యువత పర్యవేక్షణ కేంద్రాలు ఉన్నాయని ఎన్నికల అధికారి మృతి రంజన్ ప్రధాన్ తెలిపారు. ఈ ఎన్నికల కోసం 4100 ఉద్యోగులు, 73 మంది సెక్టార్ ఆఫీసర్లు విధులు నిర్వహించనున్నారు. మోహానా నియోజకవర్గంలో 297 పోలింగు బూత్‌లకు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మొత్తం గజపతి జిల్లాకు 1597 వి.వి.ప్యాట్‌లు, 1486 బ్యాలట్ యూనిట్లను సిద్ధం చేశారు. ఎన్నికల్లో శాంతి భద్రతలు రక్షించడానికి కేంద్రం నుంచి స్పెషల్ సెక్యూరిటీ కేరళ, మిజోరాం, త్రిపురా, సి.ఆర్.ఆర్.పి.ఎఫ్ రక్షణ దళాలు ఎన్నికల పోలింగ్‌కు తెప్పించినట్టు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తెలిపారు. పర్లాకిమిడి నియోజకవర్గంలో 276 పోలింగ్ బూత్‌లు ఉండగా 364 వి.వి. ప్యాట్‌లు అధికారులు సిద్ధం చేశారు. ఆదివారం పర్లాకిమిడి నియోజికవర్గంలో 276 బూత్‌లకు పోలింగ్ టీమ్‌ను పలు వాహనాల్లో తరలించినట్టు జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం..

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లో గల రెండు విధాన సభల ఎన్నికల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శనివారం కొట్‌పాడ్ (ఎస్టీ) నియొజకవర్గంలో ఏర్పాటు చేసిన 243 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించేందుకు 1455 మంది పోలింగ్ సిబ్బందిని పంపారు. ఆ నియోజకవర్గంల 29 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవి అని ఆయా కేంద్రాలలో అదనపు పోలీసులను ఏర్పాటు చేస్తారు. ఆదివారం జయపురం నియోజకవర్గంలో ఎన్నికల అధికారి జయపురం సబ్‌కలక్టర్ పర్యవేక్షణలో 238 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బందిని బ్యాలట్ బాక్సులతో పంపారు. మహిళల కోసం పింక్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.

కొరాపుట్ జిల్లాలో 9,76,695 మంది ఓటర్లు..

కొరాపుట్ జిల్లాలో 9,76,695 మంది ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకుంటారు. వారిలో 4,72,295 మంది పురుషులు, 5,04,437 మంది మహిళలు, 83 మంది ట్రాన్స్ జెండర్‌లు ఉన్నారు. జిల్లాలో 24,971 మంది ఓటర్లు మొదటి సారిగా ఓటువేయనున్నారు. 4,149 మంది సీనియర్ సిటిజన్‌లు, 16,595 మంది దివ్యాంగులు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

అడ్డంకులు అధిగమించి..

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ విజయవంతం చేసేందుకు అనుబంధ యంత్రాంగం అంకిత భావంతో ముందుకు సాగుతోంది. మార్గ మధ్యంలో అడ్డంకుల్ని సునాయాశంగా అధిగమించి పోలింగ్ కేంద్రాల గమ్యం చేరుతున్నారు. ఇంద్రావతి జలాశయం ఆవలి తీరాన ఉన్న నవరంగపూర్ తెంతులిఖుంటి మండలం కట్-ఆఫ్ ప్రాంతాలకు పోలింగు సిబ్బంది పడవలో బయల్దేరారు. వీరిలో పోలింగ్ బృందాలు, పోలీసులు, సెక్టార్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్లు ఉన్నారు.



పర్లాకిమిడి: పర్లాకిమిడి సఖీ పోలింగ్ కేంద్రం



పర్లాకిమిడి: శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాల కేంద్రంలో పోలింగ్ సిబ్బందిని పోలింగ్ బూత్‌లకు సమాగ్రి అందజేస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: గుమ్మా బ్లాక్‌కు పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న పోలింగ్ సిబ్బంది



భువనేశ్వర్: ఇంద్రావతి జలాశయం ఆవలి తీరానికి బయల్దేరిన పోలింగ్ సిబ్బంది



భువనేశ్వర్: పోలింగ్ ప్రక్రియకు బయల్దేరిన బృందం



జయపురం: ఓటింగ్‌కు సిద్ధం చేసిన పింక్ పోలింగ్ కేంద్రం



జయపురం: గ్రామీణ ప్రాంతాలకు తరలుతున్న పోలింగ్ సిబ్బంది



జయపురం: జయపురంలో పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో వెళ్తున్న సిబ్బంది



జయపురం: విక్రమదేవ్ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ ఇస్తున్న అధికారులు



జయపురం: విక్రమదేవ్ విశ్వవిద్యాయలయం ప్రాంగణంలో పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని తీసుకువెళ్లే వాహనాల కేటాయింపు

ఘనంగా మాతృదినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

పర్లాకిమిడి: స్థానిక రాజవారి ప్యాలస్‌లో యూటెక్ కంప్యూటర్స్ కార్యాలయంలో ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కుముదినీ భక్తా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యవక్తగా గిరిజా నందినీ పట్నాయక్, ఉపదేష్ట బిచిత్రా నందబెబర్తా పాల్గొనగా.. లోకనాథ మిశ్రా అధ్యక్షత వహించారు. తొలుత మహిళా కళాశాల విద్యార్థినులకు వక్తృత్వం, చిత్రలేఖనంలో మాతృత్వంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా బిచిత్రా నంద బెబర్తా వ్యవహరించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన బినోదిని సైన్సు కళాశాల అధ్యక్షులు మనోజ్ కుమార్ పట్నాయక్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రా నంద బెబర్తా పాల్గొన్నారు.



కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కుముదినీ భక్తా

విధుల్లో అప్రమత్తంగా ఉండండి

ఆమదాలవలస: ఎన్నికల విధుల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక సూచించారు. ఆదివారం ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్నికల విధులకు హాజరయ్యే పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో 33 రూట్లలో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల బందోబస్తు నిమిత్తం నలుగురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, 20 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 118 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 11 మంది మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు, 35 మంది హోంగార్డులతో కలిపి మొత్తం 205 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ కాజల్, డీఎస్పీలు వై.శృతి, విజయ్‌కుమార్, ఆమదాలవలస సీఐ దివాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

1920 మద్యం బాటిళ్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల బాక్సులతో సెబ్ పోలీసులు

కొత్తూరు: కొత్తూరు మండలం కుంటిభద్ర సమీపంలో వంశదార నది ఒడ్డున టీడీపీ వర్గీయుల నుంచి ఒడిశా చెందిన 1920 మద్యం బాటిళ్లను సెబ్ సీఐ బి.జయరాం రెడ్డి , ఎస్ఐ కె.శ్రావణిలు సిబ్బందితో కలిసి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ డి.గంగాధరం ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.30445 లక్షలు ఉంటుందని సీఐ చెప్పారు. పట్టుకున్న మద్యం నిల్వలను పలాస అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అరా బేగం పరిశీలించారు.

సిట్టింగ్‌లకు దక్కని సీట్లు

- 33 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎంపీలకు బీజేడీ మొండిచేయి..

భువనేశ్వర్: లోక్ సభ, శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధికార బిజూ జనతా దళ్ పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు టికెట్లు నిరాకరించింది. ఈసారి బీజేడీ తన అభ్యర్థుల జాబితాలో గణనీయమైన మార్పులు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యేలలో కనీసం 30 శాతం, సిట్టింగ్ ఎంపీలలో 50 శాతం మందిని తొలగించింది. వీరి స్థానాల్లో కొత్త ముఖాలను పరిచయం చేసింది. కొన్ని నియోజకవర్గాల్లో కొంతమంది సిట్టింగ్ సభ్యుల కుటుంబీకులకు టికెట్లు కేటాయించి పరోక్షంగా ఊరడించి అసంతృప్తవాదానికి తెర దించింది. గత సార్వత్రిక ఎన్నికలు పురస్కరించిన 2019లో శాసన సభకు ఎన్నికైన 112 మందిలో ఈసారి 33 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో లోక్ సభకు గెలిచిన 12 మందిలో ఆరుగురు ఎంపీలకు టిక్కెట్లు బీజేడీ నిరాకరించింది. మిగిలిన ఆరుగురిలో ఢెంకనాల్ ఎంపీ మహేశ్ సాహూకు హిందోల్, నవరంగపూర్ ఎంపీ రమేశ్ మాఝీకి ఝొరిగాంవ్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బరిలోకి దింపింది. మరోవైపు భర్తృహరి మహతాబ్ బీజేడీకి రాజీనామా చేసి కటక్ లోక్ సభ స్థానం బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. కొత్త ముఖాల్ని పరిచయం చేసి బీజేడీ పరపతిని మరింత బలోపేతం చేసే దృక్పథంతో ఈసారి సరి కొత్త సూత్రంతో అభ్యర్థుల్ని బరిలోకి దింపడం విశేషం. పలువురు సిటింగులకు టికెట్లు దక్కకున్న కొంత మందికి కుటుంబీకులకు టికెట్లు కేటాయించడం మరో మెలిక. ఈ క్రమంలో 9 మంది సిటింగుల కుటుంబీకులకు బీజేడీ టికెట్లు లభించాయి. సుబ్రత్ తొరై భార్య అర్చనరేఖ బెహెరాకు రఘునాథ్‌పల్లి. రాజ్‌కిశోర్ దాస్ భార్య ప్రీతినంద కనుంగోకు మొరొడా, రజనీకాంత్ సింగ్ భార్య సంజుక్తా సింగ్‌కు అంగుల్, ప్రతాప్ జెనా కుమారుడు అంకిత్ ప్రతాప్ జెనాకు మహంగా, చికిటి నుంచి ఉషాదేవి కుమారుడు చిన్మయానంద శ్రీరూప్ దేబ్, పారాదీప్ నుంచి సంబిత్ రౌత్రాయ్ భార్య గీతాంజలి రౌత్రాయ్, ఝొరిగాంవ్ నుండి ప్రకాష్ మాఝీ సోదరుడు రమేష్ మాఝీ, సురడా నుండి పూర్ణ చంద్ర స్వంయి భార్య సంఘమిత్ర స్వంయి, నవరంగ్‌పూర్ నుంచి సదాశివ ప్రధాని భార్య కౌసల్య ప్రధానికి టికెట్లు లభించాయి.

అటు నుంచి ఇటు..

మరికొంత మందిని అటు ఇటుగా చేసి లోక్ సభ, శాసన సభ స్థానాల్లో పోటీకి టికెట్లు కేటాయించారు. బంగిరిపొషి సిట్టింగ్ ఎమ్మెల్యే సుదామ్ మరాండిని మయూర్‌భంజ్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దింపుతూ బంగిరిపొషి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఆయన భార్య రంజిత మరాండిని పోటీకి నిలిపారు. ఇదే ప్రాతిపదికన కొరేయ్ సిటింగు ఎమ్మెల్యే ప్రణబ్ ప్రకాష్ దాస్ సంబల్‌పూర్ లోక్ సభ అభ్యర్థిగా, ఆయన తల్లి సంధ్యారాణి దాస్ కొరేయ్ స్థానం నుంచి శాసన సభకు పోటీకి అభ్యర్థిత్వం ఖరారు చేశారు.

మహిళలకు ప్రాధాన్యత..

సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి బిజూ జనతా దళ్ మహిళా అభ్యర్థులకు పెద్ద పీట వేసింది. లోక్ సభకు ఏడు మంది (33 శాతం) మహిళా అభ్యర్థులను, శాసన సభ ఎన్నికల్లో 35 (23 శాతం) మందిని బీజేడీ అభ్యర్థులుగా ప్రకటించి పోటీకి నిలిపి మహిళా ప్రాతినిధ్యంలో బీజేడీ ముందంజలో ఉంది.

ఓటరు మనసు దోచుకునేందుకు..

రాష్ట్రంలో పలు చోట్ల బీజేడీ అభ్యర్థుల పట్ల స్థానికుల్లో అసంతృప్తి ఉంది. ఈ పరిస్థితి విషమించక ముందే జాగ్రత్త పడే దిశలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలను తొలగించి కొత్త ముఖాలతో భర్తీ చేయడంలో వ్యూహాత్మక శైలిని చాటుకుంది. సిటింగుల తొలగింపు వివాదస్పదం కాకుండా ఈ వర్గం నుంచి పలువురి కుటుంబీకులకు టికెట్లు ఖరారు చేసి ఊరడించడంతో ఇంకొంత మందికి పార్టీలో ప్రతిష్టాత్మకమైన పదవులతో హోదాని రెట్టింపు చేసి బుజ్జగించింది. పోటీ నుంచి వైదొలగించడం అసంతృప్తి వాదంగా మారి బీజేడీ గెలుపు అవకాశాల్ని బలహీన పరచుకుండా అత్యంత జాగరూకత ప్రదర్శించడం నవీన్ పట్నాయక్ రాజకీయ చతురతకు అద్దం పట్టింది. ఈ వ్యూహంతో బలమైన పోటీ మధ్య అత్యధిక స్థానాల్లో విజయ శంఖారావంతో మరోసారి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశలో దూసుకుపోతుంది. అభ్యర్థుల ఎంపిక, టికెట్ల కేటాయింపు ప్రక్రియలో ప్రజల మనోభావాలు మరియు గెలుపును కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ మార్పులు అభివృద్ధి చెందుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఓటర్లను విస్తృతంగా ఆకట్టుకునే బీజేడీ వ్యూహరచన ప్రత్యర్థి వర్గాల్ని సైతం ఆలోచింప జేస్తుంది. సార్వత్రిక ఎన్నికలు – 2024 పోరులో బీజేడీ వ్యూహాత్మక సన్నాహాలు ఎంత వరకు ఫలప్రదం అవుతాయో వేచి చూడాల్సి ఉంది.

పర్లాకిమిడిలో పోటా పోటీ


- బీజేడీ, బీజేపీల మధ్యే గట్టి పోటీ



కోడూరు నారాయణరావు (బీజేపీ)



రూపేష్ పాణిగ్రాహి (బీజేడీ)



బిజయ కుమార్ పట్నాయక్ (కాంగ్రెస్)

పర్లాకిమిడి: ఎన్నికలు దగ్గరపడటంతో అధికార పార్టీ అభ్యర్థులు, ప్రత్యర్థులు ప్రచారాలు ముమ్మరం చేశారు. పర్లాకిమిడి నియోజికవర్గంలోని మూడు సమితులు కాశీనగర్, గుసాని, గుమ్మాలో బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహికి మద్దతుగా సినీ తారలు, బుల్లితెర యాంకర్లు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పర్లాకిమిడి నియోజకవర్గంలో బీజేడీ, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు మధ్య ముక్కోణపు పోటీ జరుగుతుంది.

పర్లాకిమిడి బీజేడీ పార్టీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి..

భువనేశ్వర్‌లో హైటెక్ విద్యా సంస్థలకు ఇంజనీరింగ్ మ్యానేజింగ్ డైరెక్టర్‌గా రూపేష్ పాణిగ్రాహి వ్యవహరిస్తున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త తిరుపతి పాణిగ్రాహి తనయుడు రూపేష్ పాణిగ్రాహి. గత పంచాయతీ ఎన్నికల నుంచి తిరుపతి పాణిగ్రాహి రాజకీయ రంగంలోకి తన కోడుకు రూపేష్‌ను రంగంలోకి దింపాడు. ఇటీవల గుమ్మా బ్లాక్‌లో మైనార్టీ వర్గాలు, ఆదివాసీల అభ్యున్నతి కోసం అనేక మెడికల్ క్యాంపులు చేశారు. రాజకీయాలలో గత అనుభవం లేకున్నా అధికార పార్టీ సింబల్‌తో ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నాడు. ఈ ఎన్నికల్లో గెలిస్తే పర్లాకిమిడి నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులు తిరిగి కొనసాగిస్తానని అంటున్నారు.

బీజేపీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు..

2009లో బీజేడీ పార్టీ నుంచి పర్లాకిమిడి నియోజకవర్గంలో కోడూరు నారాయణరావు గెలుపొందారు. 2019లో కోడూరుకు టికెట్టు ఇవ్వకపోవడంతో కోడూరు నారాయణరావు బీజేడీ నుంచి బీజేపీలోకి మారడంతో ఆయనకు బీజేపీ టిక్కెట్టు లభించింది. అయితే అనూహ్యంగా 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు, కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి తిరుపతి పాణిగ్రాహి, బీజేపీ అభ్యర్థి కోడూరు నారాయణ రావు ముక్కోణపు పోటీల్లో 52,415 ఓట్లతో (35.902శాతం) గెలుపొందారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి తిరుపతి పాణిగ్రాహికి 37,080 ఓట్లు లభించి రన్నర్ అప్‌గా నిలిచాడు. బీజేడీ అభ్యర్థిని యువరాణి కల్యాణి గజపతికి 26,645 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ అభ్యర్థి కెంగం సూర్యారావుకు కేవలం 24,040 ఓట్లు మాత్రమే లభించాయి.

2024 అసెంబ్లీ ఎన్నికల్లో..

2024 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేడీలో కెంగం సూర్యారావు కలవడంతో బీజేడీకి బలం పెరిగింది. ఆయనకు తోడుగా జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, గుమ్మా, కాశీనగర్, గుసాని సమితుల అధికార బీజేడీ పార్టీ అధ్యక్షులు గెలిచింది. ఎన్నికల ముందు కాశీనగర్, గుసాని నుంచి బీజేడీ నాయకులు బల్ల ధనుంజయ, రోక్కం రాంప్రసాద్, రోక్కం సతీష్ తదితరులు బీజేపీలో చేరడంతో బీజేపీ అభ్యర్థి కోడూరు నారాయణరావుకు కూడా బలం పెరిగింది.

కాంగ్రెస్ అభ్యర్థి బిజయ కుమార్ పట్నాయ

పర్లాకిమిడి కాంగ్రెస్ అభ్యర్థి బిజయ కుమార్ పట్నాయక్ 2014లో రాష్ట్ర శాసన ముఖ్య కార్యదర్శిగా భుభనేశ్వర్‌లో పనిచేశారు. ఆయనకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉంది. ఈ ఎన్నికల్లో ఆయన తొలుత కాంగ్రెస్ కంచుకోట అయిన గుమ్మాలో ముమ్మరంగా ప్రచారం చేసినా అధిక ఎండలకు వడదెబ్బ తగిలి భువనేశ్వర్ వెళ్లిపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రచారంలో ఆయన వెనకుబడినా ఆయన వర్గం గుమ్మా, కాశీనగర్, గుసానిలో పనిచేస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు బిజయ పట్నాయక్ ప్రచారానికి బయలుదేరి సాయంత్రం ఆరు గంటల్లోగా పర్లాకిమిడిలో తన ఇంటికి తిరిగివస్తున్నారు. ఆయన ప్రచారానికి రాహుల్ గాంధీ కానీ భువనేశ్వర్ నుంచి కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిరంజ్ పట్నాయిక్ గానీ ఇప్పటివరకూ రాలేకపోయారు. పర్లాకిమిడిలో తాగునీటి సమస్య తీరుస్తానని, రోడ్లు వేస్తానని, మెడికల్ కళాశాల స్థాపిస్తానని ప్రజలతోనే ఉంటానని ఓటర్లకు అభ్యర్థిస్తున్నారు. ప్రస్తుతం బీజేడీ, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోటీ ముమ్మరం అవుతుంది. రాష్ట్రంలో బీజేపీకి సానుభూతి పవనాలు వీస్తుండటంతో పర్లాకిమిడి నియోజకవర్గంలో ఆ ప్రభావం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఓన్స్ అగైన్ కె.ఎస్.ఆర్ అన్న నినాదంతో కోడూరు వర్గం ముమ్మరంగా ప్రచారం చేస్తుండటం విశేషం.

రాయగడలో భారీ వర్షం

- జలమయమైన లోతట్టు ప్రాంతాలు

రాయగడ:

రాయగడలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులలో కూడిన వర్షం కారణంగా పట్టణంలోని రాణిగుడ, న్యూకాలనీ, రైతుల కాలనీ, కొత్తబస్టాండు, పాత బస్టాండు, పిట్టలవీధిరోడ్డు తదితర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు చెట్లు నేలకొరిగాయి. దీంతొ రాకపోకలకు అంతరాయం కలిగింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయంది. విక్రమదేవ్ పాఠశాల, దుర్గాప్రసాద్ లాడ్జి ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షం నీరు చొరబడటంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన టెంట్లు గాలికి కూలిపోయాయి. ఎన్నికల సామగ్రి తడిచి పోయింది.



మెయిన్‌రోడ్డులో నిలిచిన నీరు



దుర్గా ప్రసాద్ లాడ్జి ప్రాంతంలో చెరువును తలపిస్తున్న రోడ్డు



ఇళ్లల్లోకి చేరిన నీటిని బయటకు నెట్టుతున్న దృశ్యం

క్లుప్తంగా

మద్యంతో పట్టుబడిన టీడీపీ కార్యకర్త



పట్టుబడిన మద్యం సీసాలతో సీఐ సురేష్, సిబ్బంది

భోగాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపరిచేందుకు తెలుగుదేశం, జనసేన కూటమి నాయకులు ఆదివారం మద్యం సీసాలు పంపిణీ చేశారు. మండలంలోని సవరవిల్లిలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన 45 మద్యం సీసాలతో టీడీపీ కార్యకర్త బర్ల గురుమూర్తి పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.సురేష్ తెలిపారు.

1032 మద్యం బాటిళ్లు..



రాజాం సిటీ: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ సిబ్బంది

రాజాం సిటీ: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిపిన దాడుల్లో 1032 మద్యం బాటిళ్లను పట్టుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. సంతకవిటి మండలం తాలాడ సమీపంలో 574 మద్యం బాటిళ్లు.. వంగర మండలం అరసాడ సమీపంలో 76.. రేగిడి మండలం బూరాడ సమీపంలో 380 బాటిళ్లు పట్టుకున్నామన్నారు. అలాగే ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహిత ఆత్మహత్య

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ గ్రామం యాతపేటకు చెందిన ఎర్ర చిన్న (33) ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం. మృతురాలికి భర్త రాముతో ఎప్పటికప్పుడు తగదాలు జరుగుతుండేవి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన చిన్న ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినశిర్లాంలో వ్యక్తి హత్య





హత్యకు గురైన సంగం (ఇన్‌సెట్లో) సంగం (ఫైల్)

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాతత ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. చిన్నశిర్లాం దళితవాడలో నివాసం ఉంటున్న ఉత్తరావల్లి సంగం (65) తన ఇంటి ముందు నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు నిద్రిస్తున్న సంగం గొంతును కత్తితో కోశారు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని రాజాంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఇతనికి భార్య నక్షత్రమ్మ, కుమారులు కిషోర్, కిరణ్ ఉన్నారు. సంఘటనా స్థలానికి చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, ఎస్సై ఇ.శ్రీనివాస్ చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ హత్యకు రాజకీయానికి ఎటువంటి సంబంధం లేదని పోలీసులు వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ప్రశాంతంగా ఎన్నికలు..



పోలింగ్ కేంద్రాల వివరాలపై ఆరాతీస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓటింగ్ జరిగేలా చూడాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలు, రూట్ల వివరాలను ఆర్వో ఎల్.జోసెఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లోని సదుపాయాలపై ఆరాతీశారు.

వైఎస్సార్ పంటల బీమాతో..

రైతన్నకు ధీమా



- ఐదేళ్ల కాలంలో 37,487 మంది రైతులకు రూ.33.08 కోట్ల చెల్లింపు
- పంట నష్టం జరిగిన వెంటనే బీమా చెల్లింపు
- రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం



విజయనగరం ఫోర్ట్: పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఇజ్జాడ హనుమంతురావు. ఇతనిది బొండపల్లి మండలం జి. గుమడాం రెవెన్యూ పరిధిలోని కొవ్వాడపేట గ్రామం. 2021 ఖరీఫ్‌లో రెండెకరాల వరకు అరటిపంట సాగు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా అరటిపంట దెబ్బతింది. దీంతో ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమా పథకం కింద ఇతని బ్యాంక్ ఖాతాలో రూ.27,100 ప్రభుత్వం జమ చేసింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు కొవ్వాడ కొండలరావు. ఇతనిది బొండపల్లి మండలం కొవ్వాడ పేట గ్రామం. 2021 ఖరీఫ్‌లో ఎకరం పొలంలో అరటి పంట సాగు చేసాడు. వర్షాభావ పరిస్థితుల వల్ల అరటిపంట దెబ్బతింది. దీంతో వైఎస్సార్ పంటల బీమా కింద అతని ఖాతాలో రూ. 14,577 జమైంది.

2019 నుంచి 2022 వరకు ప్రభుత్వం చెల్లించిన పంటల బీమా వివరాలు

సంవత్సరం	రైతులు	పంటలబీమా మొత్తం రూ. కోట్లలలో
2019	3,183	రూ.2,52,62,329
2020	24,625	రూ.20,68,99,051
2021	9,361	రూ.9,36,49,299
2022	324	రూ.50,14,290

అనుకోని విపత్తుల కారణంగా పంట నష్టపోతున్న రైతులను వైఎస్సార్ పంటలబీమా పథకం అదుకుంటోంది. గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రకృతి వైపరిత్యాలు పెద్దగా సంభవించలేదు. ఒకటి రెండు చోట్ల ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టం జరిగినా వాటికి ప్రభుత్వం పరిహారం చెల్లించింది. రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. సాగు పెట్టుబడి కోసం వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారా ఏటా రూ. 13,500 సాయాన్ని అందిస్తోంది. అదేవిధంగా రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే అందజేస్తోంది. అదేవిధంగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట నష్టపోయిన రైతులను అదుకోవడం కోసం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ పంట బీమా పథకాన్ని అమలు చేస్తోంది.

ఉచిత బీమా..

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. బీమాకు చెల్లించాల్సిన ప్రీమియం సొమ్మును కూడా రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇందుకు గాను ఏటా రూ. 13 కోట్లు వెచ్చిస్తోంది. పంట సాగు చేసిన రైతులు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటే చాలు పథకానికి అర్హత ఉన్నట్లే.

రూ. 33.08 కోట్లు చెల్లింపు..

జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు పంట నష్టపోయిన 37,497 మంది రైతులకు రూ.33.08 కోట్లు పంటల బీమా పథకం కింద ప్రభుత్వం చెల్లించింది. వరి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలకు ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమా అమలు చేస్తోంది. జిల్లాలో వరి పంట 93 వేల హెక్టార్ల లోను, మొక్కజొన్న 15 వేల హెక్టార్లలోను, ఉద్యానవన పంటలు 60 వేల హెక్టార్లలో సాగవుతున్నాయి.

గతంలో రైతులే చెల్లించేవారు..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాము సాగు చేసిన పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించేవారు. ఒక్కో రైతు రూ.2 వేల నుంచి 4 వేల రూపాయల వరకు రైతులే చెల్లించేవారు. ఇది అదనపు భారమే అయినా గత్యంతరం లేక రైతులే చెల్లించేవారు. కాని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల నుంచి ఒక్క పైసా తీసుకోకుండా ప్రభుత్వమే చెల్లిస్తోంది.

పీడీఎంఎస్ యాప్‌లో పోలింగ్ శాతం నమోదు

విజయనగరం అర్బన్: సాధారణ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం సేకరించేందుకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోల్ డే మేనేజ్‌మెంట్ సిస్టమ్ అనే యాప్‌లో పోలింగ్ శాతం నమోదు చేస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి పీఓలు, సెక్టార్ అధికారులు ఈ యాప్‌లో పోలింగ్ వివరాలు నమోదు చేస్తారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గాల నుంచి వివరాలు సేకరించేందుకు 35 మంది సచివాలయ సిబ్బందిని నియమించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం డిప్యూటీ ఈఈ బంగారునాయుడు పీడీఎంఎస్ విభాగంలో పోలింగ్ నమోదును పర్యవేక్షిస్తారు.

కచ్చితమైన నివేదికలివ్వాలి..



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలను కచ్చితమైన వివరాలతో వేగంగా అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ఎన్నిక రోజు మేనేజ్‌మెంట్ వ్యవస్థ'పై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద ఎలా ఓటు చేయాలి, తదితర వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలు ఎంతో కీలకమని, కచ్చితమైన సమాచారంతో అందజేయాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతాన్ని తీసుకోవాలని.. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఈ వివరాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ అనిత, ఎన్నికల రోజు మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఇన్‌చార్జ్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బంది

వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదివారం రాత్రి పరిశీలించారు. జిల్లాలోని 362 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో సహా మొత్తం 1,136 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. దీని కోసం 2,272 సీసీ కెమేరాలను అమర్చారు. వీటి ద్వారా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుంచే పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియ ఆదివారం సాయంత్రానికే ప్రారంభమైంది.


పోలింగ్ స్టేషనరీ రంగుపై గందరగోళం



ఎన్నికల సిబ్బందికి అందించిన పసుపు రంగు ఐడీ కార్డు

- పసుపు రంగు పేపర్లపై ఐడీ కార్డుల ముద్రణ
- విస్మయం వ్యక్తం చేసిన సిబ్బంది

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బందికి అందించిన స్టేషనరీ, ఐడీ కార్డులపై గందరగోళం నెలకొంది. స్టేషనరీ సామాన్లు వివిధ పార్టీల జెండాలు, ఆ పార్టీ రంగులను పోలినవి కాకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉంటుంది. అయితే ప్రస్తుత ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి అందించిన ఐడీ కార్డులు, స్టేషనరీని పసుపు రంగు పేపర్లపై ముద్రించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల్లో విధుల్లో పాల్గొనే సిబ్బందికి పసుపు రంగుతో కూడిన ఐడీలను అందించడంతో అధికారుల తీరుపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



పసుపు రంగు పేపర్‌పై ముద్రించిన ఎన్నికల స్టేషనరి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముచ్చర్లవలస గ్రామానికి చెందిన బొడ్డు జగన్ మోహనరావు(48) ఆరికతోట నుంచి తన ద్విచక్రవాహనంపై సొంత గ్రామానికి వస్తుండగా.. ఆరికతోట వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీ కొట్టింది. దీంతో జగన్ మోహనరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై జ్ఞానప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పక్కాగా ఎన్నికల ఏర్పాట్లు

- సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మొహర్దా



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా

పార్వతీపురం: సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మొహర్దా అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురంలోని డా. వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలో ఎన్నికల సామగ్రి స్వీకరణ రిసెప్షన్ కేంద్రానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ నిశాంత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజక వర్గాలకు వేరువేరుగా కేటాయించిన శిబిరాలలోని కౌంటర్ల వద్ద టేబుల్స్, కుర్చీల ఏర్పాటును, పోలింగ్ అనంతరం పీఓలు, ఏపీఓల స్క్రూటినీ, స్వీకరణకు కల్పించిన వసతులు, తదితర అంశాల ఏర్పాట్లపై కలెక్టర్ ఆయనకు వివరించారు. అలాగే లెక్కింపు కేంద్రాల వద్ద బారికేడ్లు, గోడలకు మెస్ ఏర్పాటును నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బందికి ఆహారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టు శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల సామగ్రి స్వీకరణ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గాలి, వెలుతురు, తాగునీటి వసతి కల్పించాలని చెప్పారు. టాయిలెట్స్ నిర్మాణాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రతా, ఓట్ల లెక్కింపు కేంద్రాలవద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరును వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా, పర్యవేక్షణ కోసం వసతి కల్పన చూశారు.

బస్‌ల రాకపోకలకు అంతరాయం లేకుండా..

స్ట్రాంగ్ రూమ్ వద్దకు సులువుగా చేరుకునేలా రాకపోకలకు అంతరాయం కలగకుండా కళాశాల ముందు భాగంలో బస్‌ల పార్కింగ్‌కు అనువుగా స్థలాన్ని సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఆయనకు తెలిపారు. బస్సులు నడిపేందుకు ఎక్కడా ఇబ్బంది లేకుండా రిసెప్షన్ కేంద్రానికి వచ్చేందుకు, వెళ్లేందుకు మార్గాలను సూచించినట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం ఆయన ఎన్నికలకు కేటాయించి న ప్రతి విభాగాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్. శోభిక, కంట్రోల్ రూమ్ ఎస్‌డీసీ ఆర్.సూర్యనారాయణ, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డీఆర్‌డీఏ పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారి పి.త్రినాథ రావు, డీపీహెచ్ఈఓ కేజీఎస్.నరసింగరావు, రోడ్లు భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారి ఎస్.వేణుగోపాల్ రావు, పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోచుకోవడమే వారికి తెలుసు..

- నీరు – చెట్టు, సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల కాంట్రాక్ట్‌లు టీడీపీ కార్యకర్తలకే
- ఇంకుడు గుంతలు, నాడెప్ కుండీల నిర్మాణాల్లోనూ చేతివాటం
- రూ. కోట్లు వెనకేసుకున్న టీడీపీ నేతలు



నీరు - చెట్టు పనుల్లో అరకోటికి పైగా అవినీతి జరిగిన రాకోడు వెంకునాయుడు చెరువు (ఫైల్)

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న కాలంలో (2004 ముందు వరకు) పనికి ఆహార పథకంలో పందికొక్కులా నిధులు మింగేసిన ఆ పార్టీ నేతలు 2014 – 2019 మధ్య కాలంలో మరోసారి అధికారం రావడంతో నీరు – చెట్టు పనుల్లో కోట్లాది రూపాయలు వేనకేసుకున్నారు. తెలుగు తమ్ముళ్లకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా న్యాయం చేయాలని భావించిన చంద్రబాబునాయుడు తన పాలనా కాలంలో సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాల ద్వారా వారికి లబ్ధి చేకూర్చే పనులనే అప్పగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నిధులను మింగేయడానికి జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారు. దీంతో ఐదేళ్ల టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు ప్రజల రక్తాన్ని పీల్చేశాయి. మరోసారి వారికి అధికారం అప్పగిస్తే జన్మభూమి కమిటీలకు మించి ప్రజలను మింగేయడానికి సిద్ధమైపోతారని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జిత్తులమారి చంద్రబాబును మరోసారి నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేమని ప్రజలు చెబుతున్నారు.

నీరు – చెట్టు పనుల్లో దోచేశారిలా...

విజయనగరం నియోజకవర్గంలో 2014–15 సంవత్సరం నుంచి నీరు – చెట్టు కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించిన తెలుగుదేశం ప్రభుత్వం నియోజకవర్గంలోనే చేయని పనులకు కోట్లాది రూపాయలను మింగేసింది. దీంతో పాటు చెరువుల్లో మట్టిని తవ్వి అమ్ముకొని లక్షలాది రూపాయలను దోచేశారు.

మట్టితో వ్యాపారం

చెరువుల్లో మట్టిని తీసి రైతుల పొలాలకు తరలించడానికి క్యూబిక్ మీటరుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 29 లు చెల్లించగా.. చెరువు గట్లు పటిష్టానికి, శ్మశానవాటికలు, ప్రభుత్వ కార్యాలయాలకు తరలించడానికి క్యూబిక్ మీటర్‌కు రూ. 82.80 చెల్లించింది. అయితే టీడీపీ నాయకులు ప్రభుత్వ ఖర్చుతో తీసిన మట్టిని రియల్ ఎస్టేట్ స్థలాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఒక్కో లారీ లోడుకు రూ. 400 నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేశారు. 2015 నుంచి 2019 మధ్య కాలంలో నీరు – చెట్టు పనులు 145 చేయగా రూ. 9.40 కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. వీటిలో చేసిన 63 పనులనే మళ్లీ చేసినట్లు చూపి కోట్ల రూపాయల నిధులను తెలుగుదేశం పార్టీ నేతలు దోచేశారు.

నాడెప్ కుండీల నిధులు టీడీపీ నేతల జేబుల్లోకి..

విజయనగరం మండల పరిధిలో 2016 – 17 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించేందుకు 941 వర్మీ నాడెప్ యూనిట్లకు రూ. 1.04 కోట్లతో ప్రతిపాదనలు చేయగా నాటి టీడీపీ ప్రభుత్వం 894 యూనిట్లను మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి రూ. 99.84 లక్షలు కేటాయించింది. అయితే వీటిలో సగం పనులు చేయగా, అవి కూడా నాసిరకంగా నిర్మించడంతో ఆ నిధులు టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల జేబుల్లోకే వెళ్లిపోయాయి.



రియల్ ఎస్టేట్ భూముల్లో నీరు- చెట్టు పథకంలోని చెరువు మట్టి (ఫైల్)

తెలుగు తమ్ముళ్లకు కమీషన్లు..

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకంలో మండల వ్యాప్తంగా 5,645 మరుగుదొడ్ల నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 8.46 కోట్లు మంజూరు చేసింది. అయితే మరుగుదొడ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో తెలుగు తమ్ముళ్లు అందినకాడికి దోచుకున్నారు. అలాగే నిర్మాణాలు చేపట్టిన వారి నుంచి కమీషన్లు వసూలు చేశారు.



నాసిరకంగా నిర్మించిన వదిలేసిన నాపెడ్ కుండీ(ఫైల్)



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో నాసిరకంగా నిర్మించిన మరుగుదొడ్లు(ఫైల్)

ఇంకుడు గుంతల నిర్మాణాల్లోనూ చేతివాటం..

2015 – 16లో నాటి టీడీపీ ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణాలను తెరపైకి తీసుకువచ్చి తెలుగు తమ్ముళ్లకు వేలాది రూపాయిల లబ్ధి చేకూర్చిందని చెప్పొచ్చు. మండలంలో 2000లకు పైగా ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేపట్టినట్లు రికార్డుల్లో పొందుపరచగా.. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 15 వందల వరకు నిధులు మంజూరు చేశారు. వీటిలో అనేక గ్రామాల్లో ఇంకుడు గుంతలు తవ్వకుండానే జన్మభూమి కమిటీలు, అధికార పార్టీ నేతలు జేబులు నింపుకున్నారు.

వైభవంగా ఆది శంకరాచార్యుల జయంతి



ఆది శంకరాచార్యులకు పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్రపాలకులైన ఉమా సదాశివాలయంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని ఆదివారం వైభవంగా నిర్వహించారు. శంకరాచార్యుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో విశేష అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు మల్లికార్జునశర్మ, కిరణ్ కుమారాచార్యులు పాల్గొన్నారు.

ప్రేమతో సేవలు చేయాలి..

విజయనగరం టౌన్: వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ప్రేమతో సేవలు చేయాలని అంబటిసత్రం ఏసు ప్రేమాలయం చర్చి పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. చర్చి ఆవరణలో ఆదివారం మదర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలోని సిరియా బృందం మహిళలందరూ కలిసి సండే స్కూల్ సూపరింటెండెంట్ ఝాన్సీ సుజన్‌తో పాటూ సూర్యాకాంతం, అలజంగి సువర్ణలను ఘనంగా సత్కరించారు.